# ఆడపోలీసు !

డ్యూటీ చేస్తున్న లేడీకానిస్టేబుల్‌ని ఓ ఆకతాయి కుర్రాడు (అఫ్‌కోర్స్ సినిమా హీరోలా వున్న వాడేలెండి) పట్టపగలు పబ్లిగ్గా నడిరోడ్డుమీద ముద్దుపెట్టుకుని రఁయ్‌మంటూ శరవేగంతో పారిపోయి మాంత్రికుడిలా అదృశ్యమైనాడు.

సిటీలో పై అద్భుత కార్యక్రమం సెన్సేషన్ న్యూసై దావానలంలా వ్యాపించింది క్షణాల్లో!

ముద్దుపెట్టి పారిపోయిన కుర్రాడికోసం పోలీసులు కొన్ని బృందాలుగా ఏర్పడి తీవ్రంగా గాలించటం షురూ అయింది. కాదా మరి?... ఓ అమ్మాయిని పబ్లిగ్గా ముద్దెట్టుకోవటమంటే మాటలా?... అందులోనూ ఆడపోలీసును.

ఈ ఇన్సిడెంట్‌కి తోకలు ఈకలు అతికించి వార్త రాసిన అన్ని పత్రికలూ హాట్‌కేక్స్‌లా (కనీసం ఒక్క కాపీ అయినా మిగులకుండా) అమ్ముడైనాయ్.

మహిళా సంఘాలు పై దుర్ఘటనను తీవ్రంగా ఖండించినయ్. పురుషాహంకారమంటూ దుమ్మెత్తిపోశారు. ఈ సంఘటన స్త్రీ జాతికే అవమానమంటూ లొల్లి చేశారు.

స్త్రీవాద హక్కుల కమిటీ మగజాతిపై ధ్వజమెత్తారు. మగవాళ్లమీద కారాలు మిరియాలు రోట్లోపింది!

మహిళలంతా ఏకమై పెద్దపెట్టున నినాదాలతో నిరసన తెలిచేస్తూ 'చలో అసెంబ్లీ' అన్నారు. ఇంకేముంది పోలీసు యంత్రాంగానికి రెండు చేతులా పనే!

ఇంతమంది మహిళలను కంట్రోలు చేయటానికి వున్న ఆడపోలీసు సిబ్బంది చాల్లేదు. అంచేత మగ పోలీసులూ రంగప్రవేశం చేయటంతో స్త్రీల ఆగ్రహానికి గురికావలసి వచ్చింది.

పోలీసులు ఓడి మహిళలు గెలిచారు. ముఖ్యమంత్రిగారిని కలిసి తమ నిరసనని తెలిచేస్తూ వినతిపత్రం వారి చేతిలో పెట్టారు. నిందితుడిని వెతికిపట్టుకోవాలనీ... కఠినాతి (నాతి కాదు సారీ!) కఠినంగా శిక్షించాలనీ కోరేరు.

హమ్మయ్య! అక్కడితో మహిళలు ఆక్రోశం తీరింది. చల్లబడ్డారు.

ఇక నాణేనికి రెండవవైపు...

ఇంటరాగేషన్లో ముఖ్యమైన భాగంగా భావించిన విచారణాధికారి ముద్దు పెట్టించుకున్న (సారీ పెట్టింది కుర్రాడు కదూ) ఆడపోలీసు అనూహ్యను అడ్డదిడ్డంగా సవాలక్ష ప్రశ్నలు వేశాడు.

ఆకస్మిక చర్యకు మానసికంగా చలించి 'షాక్'కు గురైన కారణాన (అణాకాదు... అర్ధణా కాదు. వాటి కాలం ఏనాడో చెల్లిపోయింది) నిందితుడిని పట్టుకోలేకపోయానంటూ వాపోయి

కళ్లు వాచేలా వలవలా ఏడ్చింది.

పోలీసులు ఏడవరాదు! ఆడపోలీసుకూ దయాదాక్షిణ్యాలుండకూడదు కనుక వీళ్ళు ఏడవకూడదంటూ విచారణాధికారి క్లాసు పీకాడు.

ఎలాగో అలా ఎంక్వైరీ పూర్తి అయింది. బతుకుజీవుడానుకుంది అనూహ్య!

మగ ఆడ కాలేజీలో అనూహ్య డిగ్రీ చదివి పాసైంది. వట్టి పాస్ కాదు... ర్యాంకు సాధించింది. కాలేజీ బ్యూటీగా డిగ్రీలో వరుసగా మూడేళ్ళు అనూహ్యే ఎన్నికైంది.

అనూహ్య అంటే మొదటినుండీ డోన్ట్‌కేర్ మాస్టర్! ఎవరినీ లక్ష్యపెట్టేదికాదు. మగపిల్లలందరికీ టెర్రర్!

అనూహ్యను ఫాలో చేయాలన్నా... కామెంట్ చేయాలన్నా... మాట్లాడాలన్నా... స్టూడెంట్స్‌కి ముచ్చెమటలు పోస్తయ్.

క్రికెట్ ఆటలో దిట్ట! గరల్ స్టూడెంట్స్ క్రికెట్ టీమ్‌కి అనూహ్య కెప్టెన్! బ్యాటు పట్టుకుంటే సిక్సరే!

ఇన్ని ప్లస్ పాయింట్స్ వున్న అనూహ్య... పోయిపోయి పోలీసు కానిస్టేబుల్ వుద్యోగాన్ని ఎందుకు కౌగలించుకుందో ఎవరికీ తెలియని మిలియన్ డాలర్ క్వశ్చనేంకాదు.

జాబ్ కోసం పరుగులు తీసింది. రాత పరీక్షలు ఎన్నో రాసింది. ఆమె తెలివితేటలకు అందానికీ ఆహా ఓహో అన్న వారెవరూ ఎంప్లాయ్‌మెంట్ విషయంలో సాయపడ్లేదు.

ఆ కారణాన అనూహ్యలో కసి పెరిగింది.

తండ్రికి నలుగురూ ఆడపిల్లలే! అనూహ్య అందరికంటే పెద్దది. తనే కుటుంబాన్ని పోషించాల్సిన అవసరం మీదపడింది.

అందుకే చేజిక్కిన అవకాశాన్ని చేజార్చ తల్చుకోలేదు. పోలీసు ఉద్యోగాన్ని అవమానంగా భావించనూలేదు.

భూలోకరంభ... అతిలోక సుందరి అయిన అనూహ్య చుట్టూ ఎంటైర్ పోలీస్ డిపార్ట్‌మెంట్ పరిభ్రమించటం మొదలైంది.

ఆమెను క్లోజ్‌గా వాచ్ చేయని... ఫాలోకాని పోలీసు పురుష పుంగవులంటూ లేరు. వీరందరినీ ఎదుర్కోవటం ఓ ఛాలెంజ్‌గా భావించింది అనూహ్య.

కిందిస్థాయి నుండి పైస్థాయిలో వున్న వారంతా ఆమె ఫాన్లే! అనూహ్యకున్న ఫాలోయింగ్ ఫాన్ ఫాలోయింగ్ సినీతారక్కూడా వుండదేమో అన్పిస్తుంది.

క్యూలో వున్న వారందరినీ 'ఛీ' కొడుతూ వచ్చింది. డామిట్! కథ అడ్డం తిరిగిందని తోక తొక్కిన తాచులై... అనూహ్య మీద కసి పెంచుకున్నారు. ఏదైనా కేసులో ఇరికించి కక్ష తీర్చుకోవాలనుకునేవారూ లేకపోలేదు.

ఎక్కడ చిక్కితే అక్కడ అఫీషియల్‌గా నొక్కేయాలనే అవకాశం కోసం నిరీక్షిస్తున్నవారి సంఖ్యే ఎక్కువైంది.

★★★★★

అనూహ్య తండ్రి గోవిందు పూర్వాశ్రమంలో నేషనల్ లెవల్లో అథ్లెట్! పరుగు పందెంలో అతడిని అధిగమించగలవారెవరూలేరు ఆ రోజుల్లో!

తొలిసారిగ ఒలంపిక్స్‌కి భారతదేశం తరుపున వెళ్ళిన ఏకైక ఆటగాడు. పరుగుపందెంలో సిల్వర్‌మెడల్ సాధించిన ఘనత గోవిందుదే!

ఇటు ప్రజలు... అటు దేశాధినేతలు గోవిందుని పొగడ్తల్లో ముంచెత్తారు. ఇంద్రుడన్నారు. చంద్రుడన్నారు. గోవిందు మొట్టమొదటి రన్నర్... ఒలింపిక్స్‌లో విన్నర్ అయినందుకు పత్రికలన్నీ ఘనంగా శ్లాఘించినయ్. ఆకాశానికెత్తేసినయ్.

కానీ... జీవనోపాధికై ఏ ఒక్కరూ గోవిందులాంటి గొప్ప అథ్లెట్‌ని ఆదుకోకపోవటం దురదృష్టం!

ఇప్పటికిమల్లె... గతంలో ఆటగాళ్ళకు ఆదరణ ప్రజాకర్షణ అంతగా లేకపోవటంతో ప్రభుత్వం గానీ... స్పాన్సరర్స్‌గానీ ఆర్థికంగా చేయూతనందించటం జరగలేదు.

జీవనోపాధి కోసం గోవిందు చిన్నా చితక ఉద్యోగాలు చాలా చోట్ల చేసాడు. కొద్దిపాటి ఆదాయంతో కుటుంబాన్ని పోషించటమూ భారమైంది.

నలుగురు ఆడపిల్లల్లో రెండవ అమ్మాయి పసితనంలోనే పోలియో బారిన పడింది. వయసు పెరిగినా ఇంట్లో దేకుతూ పాకుతూ తిరుగుతుంటే... గోవిందు గుండె చెరువయ్యేది. మూడోపిల్ల వంటినిండా తెల్లమచ్చలు... ఊబకాయంతో బాధపడుతోంది. నాలుగో పిల్ల మూగది చెవిటిది. పుట్టుకతోనే కంటిచూపు కరువై గుడ్డిదైంది.

ఎటొచ్చీ అనూహ్య వక్కతే గోవిందు కుటుంబంలో తప్ప పుట్టింది. తెలివి చదువు అందంతో ప్రయోజకురాలై జాబ్ చేస్తూ కుటుంబ భారాన్ని తన భుజాల మీద వేసుకుంది!

గోవిందు కంటతడి పెట్టని రోజంటూలేదు. తనకు ఎంతటి పేరు ప్రఖ్యాతులుండేవి. ఒక క్రీడాకారుడిగా దేశ గౌరవాన్ని పెంచగలిగాడు. అంతర్జాతీయ ఖ్యాతి గడించిన తొలి ఆటగాడు తనే! అయినా తన ప్రతిమ తనకు అన్నం పెట్టలేదు. ఆకలి తీర్చలేకపోయింది. తనను ఆదుకునే వారే లేకపోయారు.

దేశం యావత్తూ తనను మెచ్చుకుంది. శ్లాఘించింది. కానీ తర్వాత మర్చిపోయింది. తానెవరికీ అక్కర్లేకుండా మిగిలేడు.

పెద్దకూతురు అనూహ్యకి పోలీసు ఉద్యోగం వచ్చినందుకు ఆ దేవుడు తనను కరుణించాడని సంబరపడ్డాడు. కానీ... మిగిలిన ముగ్గురు ఆడపిల్లల గతేమిటనేది గోవిందుకున్న వర్రీ.

మరో మంచి ఉద్యోగం వచ్చేదాకా పోలీసు డిపార్ట్‌మెంట్‌లోనే వుంటూ పేరు తెచ్చుకోమని

అనూహ్యను ఆశీర్వదించాడు.

'నా తడాఖా చూపిస్తా డాడీ! పోలీస్ పవరేంటో ప్రజలకు తెలిచేస్తాను...' ఆవేశపడిపోతూ గర్వంగా తండ్రికి బదులిచ్చింది అనూహ్య.

★★★★★

టూవీలర్‌మీద వెడుతున్న అనూహ్య సడన్ బ్రేక్‌వేసి... ఓ కుర్రాడిని కాలర్ పుచ్చుకుని లాఠీతో వుతికి ఆరేసింది.

'ఏరా రాస్కెల్... పట్టిగ్గా పట్టపగలు పిక్‌పాకెట్ చేస్తున్నావా...? పర్సూసెల్లూ కాజేస్తావా?' కాళికాదేవిలా హుంకరించింది.

వాడిని ఈడ్చుకెళ్ళి లాకప్‌లో వేసి కేసు బుక్ చేసింది అనూహ్య.

ఇలాంటి సాహసకృత్యాలెన్నో చేస్తోంది. హెల్మెట్ ధరించకుండా నడిపే వాహనచోదకులకు సీరియస్‌గా వార్నింగ్ ఇవ్వటం... చలాన్ చేయటం దైనందిన చర్యలో భాగమైంది. రూల్స్‌ను అతిక్రమించే వారెవ్వరినీ స్పేర్ చేయటంలేదు.

సక్సెస్‌ఫుల్‌గా ప్రొబేషన్ డిక్లేరైంది. ఉత్తమ ఆడపోలీసు పతకం ముఖ్యమంత్రిగారి చేతులమీదుగా అందుకున్నందుకు గర్వించింది.

మరో రెండేళ్లు గడిచేసరికి ఎస్సై పోస్ట్‌కి సెలక్టయింది అనూహ్య!

ఇది అనూహ్య జీవితంలో వూహించని గొప్ప మలుపుగా భావించింది.

★★★★★

ఇలా ఇలా కథ నడుస్తూ అనేకమైన కొత్త మలుపులు తిరుగుతూ... ప్రేక్షకులు వూహించని నవ్యమైన రీతిలో కథ ముగుస్తుంది.

ఆనందరావ్ చెప్పిన కథ దర్శక నిర్మాతలకు బోలెడంతగ నచ్చేసింది. ఎడ్వాన్సిచ్చి ఎగ్రిమెంట్ రాయించుకున్నారు.

హీరో హీరోయిన్ పాత్రలకు కొత్తవారిని ఎన్నికచేసి... పాటల రికార్డింగ్ జరిగేక... పిక్చర్ షూటింగ్ ఆరంభమైంది.

తీస్తున్న సినిమా పేరే.. ఆడపోలీసు! దాని ఓపెనింగ్ షాటే... కానిస్టేబుల్ అనూహ్య డ్యూటీలో వుండగా... ఓ కుర్రాడు కిస్ చేసి పరుగెత్తికెళ్ళిన సీను!

జరిగిన సంఘటనలన్నీ సినిమా షూటింగ్ కార్యక్రమంలోనివనీ... వాస్తవాలు కావనీ ప్రజలకూ అర్థమైంది!!

- సమాప్తం -